

అన్ని వస్తువుల్నీ గుర్తించగలుగుతాడా?

యస్సార్!

అక్షరాలన్నీ వచ్చా?

అన్నీ వచ్చండి...!

బాగా యాక్టివ్‌గా వుంటాడా?

అంతకు ముందు బద్దలు కొట్టిన మంచి నీటి కుండను చూపిస్తూ 'అదిగో... మీరే చూశారుగా..'

సర్సరే.. ఇంతకీ మీరేం చదూకున్నారు?

డిగ్రీ చేశానండి! తెలుగు మెయిన్...!

మరి మీరేం చదూకున్నారమ్మా?

నేను కూడా డిగ్రీయేనండి!

## ఇంటర్వ్యూ

ఉద్యోగం లాంటిదేమైనా...

చేస్తున్నానండి.. ఈ రోజుల్లో వైఫ్ అండ్ హజ్బెండ్ ఇద్దరూ ఉద్యోగాలు చెయ్యకపోతే గడవడం కష్టం కదండీ...!

'నిజమేలెండి... అయినా ఏమనుకోవద్దు! మీ అబ్బాయికి ఎల్కేజీ సీటివ్వలేకపోతున్నాం! సారీ..!'

అదేంటండీ...!

అవునండీ.. మరి మీరిద్దరూ ఉద్యోగాలకు వెళ్ళిపోతే – ఇంక హోం వర్క్ చేసేదెవరనీ...!?

సారీ.. నిష్కర్షగా చెప్పిందా కంఠం.

పాపం! పేరెంట్ల మొహాలు ఫేడవుట్టైపోయాయి!

** ** **

నీకు వంటవచ్చా...?

వచ్చండి..

బాగా చదూకున్నావా...?

డిగ్రీదాకా చదువుకున్నానండి.

పి.జి. ఎందుకు చెయ్యలేదు..?

సమాధానం లేదు.

'సర్లే..! రేపు పెళ్ళయ్యాక చేద్దూగాని..! పోనీ టైపొచ్చా..?

టైపే కాదండి.. షార్ట్ హ్యాండ్ కూడా వచ్చండి.. ఇవిగో నా సర్టిఫికెట్లు.. ఫైల్ చూపించబోయింది.

అవసరం లేదులే...? ఇక పాటలు ఏమైనా...

ఈ మధ్యనే రేడియోలో లలిత సంగీత కచ్చేరీ కూడా ఇచ్చానండి.

డాన్సు వగైరా లేమైనా.. ప్రశ్న అర్థోక్తిగా ఆగిపోయింది.

భలేవారే.. డాన్స్‌లో మా అమ్మాయి డిప్లమో చేసిందండీ..

అమ్మాయి తండ్రి మధ్యలో కల్పించుకుని తక్కువ బదులిచ్చాడు.

కాస్త అటూ ఇటూ నడమ్మా...

నడచి చూపించింది. మిగిలిన అన్ని పరీక్షల్లోనూ ఫస్టుమార్కుతో నెగ్గేసింది.




ఉద్యోగం ఏమైనా చేస్తోందా..?

లేదండి. ఆ ఉద్దేశం కూడా లేదండి.

అయితే ఈ సంబంధం మాకొద్దు!

అదేమండీ..?

మరి మా అబ్బాయికి ఉద్యోగం లేదుగా!

అమ్మాయి తండ్రి మొహం అప్పడంలా మాడిపోయింది.

** ** **

మీ వెనక్కాల ఎంత మందున్నారు?

నా వెనకే కాదు, ఆ పక్కా, ఈ పక్కా కల్పి భారీగానే జనమున్నారండి. మీరు ఊ అంటే చాలు క్షణాల్లో దించేస్తా.

మీ ఆస్తిపాస్తులు...

ఏదో ఫర్వాలేదండి! మీరడిగినంత పార్టీ ఫండ్ ఇచ్చుకునేంత వుందండి. ఆ మధ్యన కార్పొరేషన్ ఛైర్మన్ గిరీ చేసినప్పుడేదో కాస్త వెనకేశాలెండి!

వెరీగుడ్! ఇంతకీ మీరెంతమందికి స్పాట్ పెట్టించుంటారు?

ఆ.. ఏదో చిన్నంకేలెండి! సుమారు ఓ పాతికేసుకోవచ్చు!

వెరీనైస్.. మరి రేప్సెన్లూ వగైరా లేమైనా...?

ఖాళీ డబ్బాలో గులకరాళ్ళేసిన చందాన ఓ సకిలింపువినిపిస్తూ – ప్రత్యక్షంగా ఏం లేవుగానీండి, మొన్నా మధ్య ఎలక్షన్ల టైంలో......

వండర్‌ఫుల్! ఇంక చీటింగ్ పన్లూ ఎట్సెట్రా లేమాత్రం వుంటాయి?

భలేవారే సార్! మనకున్నవన్నీ అవేగా! మీరు పార్టీలో కీ పోస్టుల్లో వున్నారనుకొండి..! దురదృష్టవశాత్తు సడన్‌గా నాయకుడు కన్ను మూశాడు. ఆ నాయకుడే లేకపోతే పార్టీ వుండీ లేనట్లే మరి! కార్యకర్తలంతా తలోమూలా చేరి బుర్రట్టుకున్నారు. ఆ సమయంలో ఏదో ఒకటి చెయ్యాలి. అందుకు మీరే ముందుండాలి. మరా సమయంలో మీరేం చేస్తారు? బాగా ఆలోచించి జవాబు చెప్పండి మరి!

అందుకు పెద్దగా ఆలోచించాల్సిన పనేముందండీ? ఆ నాయకుడి శరీరాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో భద్రపరచి, అద్దాల పెట్టెలో వుంచి, దాన్ని తీసుకుని జనంలోకి వెళ్ళిపోతే సరి! సింపతీ దానంతటదే వస్తుంది... నో డౌట్...

అంతే! పార్టీ నేత మొహం వెయ్యి వోల్టుల బల్బులా వెలిగిపోయింది.

– మల్లాది కామేశ్వరరావు